# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్ధమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్ధికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కధా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కధలు..!!

# రంగుటద్దాలు

ఆ అపార్ట్మెంట్  కాంప్లెక్స్ లో ఆ రోజు రెండు మీటింగులు జరుగుతున్నాయి. ఒకటి కమిటీ మీటింగూ, రెండోది పిల్లలకోసం అమ్మలు నిర్వహిస్తున్న మీటింగూ.. మొదటిది జరుగుతున్న కమిటీ ప్రెసిడెంట్ ఆనంద్ ఇంట్లో గంభీరంగానూ, రెండోది జరుగుతున్న చోట కోలాహలంగానూ ఉంది వాతావరణం.

"మాకు తెలుసు ఏం చెయ్యాలో!! అనిల్ అంకుల్ ఎప్పుడో చెప్పాడు మాకు" ఆరేళ్ళ రిషిక అంది.

" ఏం చెప్పాడు ?" అంది రిషిక వాళ్ళ అమ్మ ప్రీతి ఆశ్చర్యంగా.

" కొత్త అంకుల్స్ కానీ ఆంటీలు కానీ మా దగ్గరకు వచ్చి చాక్లెట్స్ అవీ, ఇస్తే తీసుకోకూడదనీ, ఎవరైనా ఇంట్లో మమ్మల్ని తీసుకు రమ్మన్నారని చెప్పినా అస్సలు బిలీవ్ చెయ్యకూడదనీ" అంది రిషిక కళ్ళు గుండ్రంగా తిప్పుతూ..

" అవును, అంతే కాదు. మీరు ఇప్పటిదాకా చెప్పినవన్నీ మాకు అంకుల్ ఎప్పుడో చెప్పాడు" అంది శమిత కూడా..

" అంటే" అడిగింది హరిత

" మమ్మీ!  కొత్తవాళ్ళెవరినీ మన దగ్గరికీ రానీకూడదనీ, ఎవరైనా మనల్ని ఫోర్స్ చేస్తే వెంటనే పేరెంట్స్ కి లేదా టీచర్ల కి చెప్పాలనీ చెప్పాడు" అన్నాడు హర్ష.

"ఇంకోటి మర్చిపోయావా! " అంటోంది రెండు పిలకలేసుకుని చిన్న కళ్ళజోడు పెట్టుకున్న పింకీ.

" అదేమిటి? నువ్వు చెప్పు పింకూ"! అంది వాళ్ళమ్మ విద్య.. వీళ్ళ మాటలు వింటున్న మిగతావారందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు.

" అదేమిటంటే, ఎవరైనా వచ్చి మేము మీకు బాగా తెలిసిన వాళ్ళం, మాతో అస్సలు భయం లేకుండా రావచ్చు అని చెప్తే వాళ్ళు నిజంగా నిజం చెప్తున్నారో, లేదో టెస్ట్ చెయ్యడానికి ఒక ట్రిక్,  అది " మా సెక్యూరిటీ అంకుల్ పేరేమిటి?" అని అడగమన్నారు. ఒకవేళ వాళ్ళు మనకి నిజంగానే తెలుసున్నవారైతే అనిల్ అని చెప్తారు కదా అదన్నమాట ట్రిక్"  అంది పింకీ.

ఈ సారి అమ్మలందరూ ఆశ్చర్యపోయారు. కొందరి కళ్ళల్లో సన్నటి నీటితెర.

---------------

దానిక్కారణం రెండో ఇంట్లో మీటింగ్.

" అనిల్ పని మానేసి వెళ్ళిపోతానంటున్నాడు" క్లుప్తంగా అన్నారు ఆనంద్. మీటింగ్ పెట్టిందే దానికోసం కనక.

" అదేమిటి? ఎందుకు? అంతా బావుంది కదా? ఏమీ సమస్యలేమీ లేవు కదా?" అన్నారు సభ్యులు.

" మనకి లేవు, కానీ అతనికి కూడా లేకుండా ఉండాలికదా?" అన్నారాయన

" అదేమిటి? వివరంగా చెప్పండి అర్థమయ్యేలా" అన్నారు సభ్యులు.

" నేను చెప్పడమెందుకు? అసలు వ్యక్తితోనే చెప్పిద్దాం. కష్టపడి ఆపాను అతన్నీఒక్కరోజు" అన్నారు ఆనంద్. బయట మెట్లమీద కూర్చున్న అనిల్ ని తనతో తీసుకుని వచ్చారు.

---------------------------- –

జంటనగరాల్లో ఉన్న అనేక అపార్ట్మెంట్ కాంప్లెక్స్ ల్లో చంద్రకిరణ్ రెసిడెన్సీ ఒకటి . అందులో నలభై ఫ్లాట్స్ ఉన్నాయి. చిన్న కాంప్లెక్స్ కావడాన అందరూ కలిసి మెలిసి సరదాగా ఉంటారు ఒక కుటుంబ సభ్యులలాగే. అప్పుడప్పుడూ ఎదురయ్యే నీళ్ళ సమస్యనైనా, ఎప్పుడూ ఉండే పార్కింగ్, పరిసరాల శుభ్రతా వగైరాలైనా సరే అందరూ కలిసి చర్చించుకుని మరీ ఒక నిర్ణయానికొస్తారు. ఆడవారు ఒక గ్రూప్ గా ఏర్పడి సాంస్కృతిక కార్యక్రమాలు, పిల్లలకి కావలసిన క్లాసులూ అవీ నిర్వహిస్తూ ఉంటారు.

ఆ కాంప్లెక్స్ కున్న పెద్ద గేటుపక్కకి చిన్న సెక్యూరిటీ కేబిన్, దానికి వెనకవైపు ఒక చిన్న గది, బాత్రూం ఉన్నాయి దానిపక్కనే పిల్లలకోసమని ఉంచిన చిన్న ఆటస్థలమూ, పక్కన ద్విచక్రవాహనాలు పెట్టుకోవడానికి స్థలమూ ఉంటాయి. మధ్యలో రెండు చిన్న చిన్న లిఫ్ట్ లూ, దానికి నాలుగు వైపులా కార్లు పెట్టుకోవడానికి స్థలమూ ఉంది. నాలుగు వైపులా కొద్దిగా మట్టి వదిలి చిన్నవీ, పెదవీ చెట్లు పెంచారు. ఆ కాంప్లెక్స్ లో చిన్నా పెద్దా చేరి ముప్ఫై మందివరకూ పిల్లలున్నారు.

అక్కడ ఈ మధ్యనే చేరిన సెక్యూరిటీ గార్డ్ అనిల్.

దాదాపు నాలుగు నెలల క్రితం, తనకెవరూ లేరనీ, ఇంతకుముందు పనిచేసిన అనుభవం ఉందనీ, బెంగుళూరులో ఒక పెద్ద సెక్యూరిటీ ఏజెన్సీ తరఫున పెద్ద కాంప్లెక్స్ లలో పనిచేశాననీ, వారి వ్యవహారం నచ్చక, వచ్చేశానని చెప్పాడు. అతని మాటతీరు, మనిషి వాలకమూ నచ్చి వెంటనే అతన్ని పనిలో చేర్చుకున్నారు ఆ అపార్ట్మెంట్ వారు. దానికి తగ్గట్టుగానే అతనుకూడా అందరితోనూ తొందరలోనే కలిసి పోవడమే కాకుండా పనులన్నీ ఎంతో శ్రద్ధగా చెయ్యడంతో అందరికీ ప్రీతిపాత్రుడయ్యాడు. ముఖ్యంగా కమిటీ ప్రెసిడెంట్ ఆనంద్ కి అనిల్ చాలా నచ్చాడు. అనిల్ ఎంతో సంస్కారవంతంగా మాట్లాడతాడు. ఎలాంటి పనినైనా చిటికెలో చేస్తాడు. చదువుకున్నవాడు కావడం చేత అన్నీ తొందరగా అర్థం చేసుకుని, అకవుంట్స్ అవీ కూడా తానే చూస్తున్నాడు ఈ మధ్యన.

"అనిల్, మోటార్ వేశావా?"

" అనిల్, కిందా స్కూల్ బస్ వస్తే ఒక్క నిమిషం ఆగమని చెప్పు దీక్ష వచ్చేస్తోంది"

" అనిల్, కరంట్ బిల్లు వచ్చిందా?"

" అనిల్, కూరగాయలబ్బాయి వస్తే ఆకుకూరలు నీకిమ్మని చెప్పాను, కాస్త తెచ్చిపెట్టు"

ఇలా పొద్దున్న లేస్తే అందరి నోళ్ళల్లో పలికే పేరు అనిల్ ది.. ఇవన్నీ ఒకెత్తు. అనిల్ కి పిల్లలంటే ఉన్న అభిమానం ఇంకో ఎత్తు. అతనిలో ఏం మహత్యం ఉదో గానీ ఎలాంటి పిల్లలనైనా మాలిమి చేసుకోగలడు. అందరితోనూ సరదాగా కబుర్లు చెప్పి, నవ్విస్తూ, ఆడిస్తూ ఉంటాడు. దానివల్ల పిల్లలు తొందరగా అతని దగ్గర చేరిక చూపడమేకాక ఎంతో ప్రేమగా ఉండేవారు. అందులోనూ కొందరు బాగా చిన్నపిల్లలు 'అనిల్ అంకుల్ 'అంటూ ఒక్క నిమిషం కూడా వదిలేవారు కాదు. ఆ కోవలోకే వస్తారు హర్షా, భవ్యా. రిషికా మొదలైనవారందరూ..

గేటుదగ్గరే పిల్లలు ఆడుకునే స్థలం ఉన్నందున అందరూ ఎప్పుడూ అనిల్ కి కనిపిస్తూ ఉంటారు. అందరితోనూ నవ్వుతూ మాట్లాడుతూ, వాళ్ళు ఒకరితో ఒకరు కొట్టుకోకుండా చూస్తూ అందరినీ ఎంతో జాగ్రత్తగా చూస్తాడు. ఎవరి పుట్టినరోజైతే వారికి చాక్లెట్ తెస్తాడు. పిల్లలంటే ఎంతో ప్రాణంగా ఉంటాడు. అప్పుడప్పుడూ తన ఫోన్ తో ఫోటోలు తీస్తాడు.

ఆ రోజు కూడా ఎప్పటిలాగే పిల్లలందరూ ఆడుకుంటున్నారు. ఓ పక్కగా ఆడవాళ్ళు నిలబడి కబుర్లు చెప్పుకుంటున్నారు. పిల్లలని చూస్తూ, మాట్లాడుతూ సాయంత్రం కార్లు వచ్చేవేళ కావడాన గేటుని కనిపెట్టుకుంటూ ఉన్నాడు అనిల్ ఎప్పటిలాగే.

" తను మా చెల్లెలు స్వాతి, బెంగుళూర్ నించి వచ్చింది " తన స్నేహితురాళ్ళకి పరిచయం చేసింది ప్రీతి.

" హే, మీరిద్దరూ కవలపిల్లల్లా ఉన్నారు భలే" అంది విద్య స్వాతికి హలో చెప్తూ.

" అవును అందరూ అలాగే అంటారు, నాకన్న సంవత్సరమున్నరే చిన్నది. అందుకేనేమో" అంది ప్రీతి నవ్వుతూ.

" బయటకు వెళ్తున్నారా?" తయారై ఉన్న ఉన్న అక్క చెల్లెళ్ళని చూస్తూ అడిగింది హరిత.

"అవును, అరవింద్ రాగానే టాంక్ బండ్ కి వెళ్ళి, డిన్నర్ కి బయటకు తీసుకెళదామని అనుకు న్నాం " అంది ప్రీతి.

" నాకు టాంక్ బండ్ అంటే చాలా ఇష్టం, ఎప్పుడు వచ్చినా ఒక్కసారైనా చూడకుండా ఉండను. అంటూ రిషీ ని తీసుకుని వస్తానక్కా" అంది స్వాతి.

" అది అప్పుడే రాదులే, అనిల్ దగ్గరుందిగా" అంది ప్రీతి నవ్వుతూ.

అనిల్ రిషిక ని ఎత్తుకుని ఏదో చెప్తున్నాడు. ఐదేళ్ళ రిషిక కిల కిలా నవ్వుతోంది.

"మీ కొత్త సెక్యూరిటీ గార్డా? అడిగింది స్వాతి అక్క ప్రీతిని. " అవును, ఈ మధ్యనే వచ్చాడు, చాలా మంచి వాడు. ముఖ్యంగా పిల్లలతో ఎంత బాగా కలిసి పోతాడో చెప్పలేదు. పాపం ఎవరూ లేరుట, ఇక్కడే ఉండి వండుకుని తింటాడు.." మన రిషిక కి అనిల్ అంటే ప్రాణమనుకో" అంది ప్రీతి

" ఓ హో, అయినా జాగ్రత్తగా ఉండక్కా" అంది స్వాతి గొంతు తగ్గించి.

" హుష్, ఊరుకో, వినబడితే బావుండదు, బాధపడతాడు" అంది ప్రీతి.

"అవును, మా భవ్య కూడా అంతే, అనిల్ ని చూస్తే వదలదు ఒక్క నిమిషం కూడా". గట్టిగా వద్దంటే పెద్దగా ఏడ్చి గోల చేస్తోంది" అంది మమత ప్రీతి మాటలు విని.

" నిజమే, హర్ష కూడా అంతే! ఆ మాటకొస్తే మన ఫ్లాట్స్ లో చిన్న పిల్లలందరూ అతని చుట్టూ చేరుతారు ఖాళీ దొరికితే చాలు, అనిల్ అంకుల్ అంటూ పరుగుతీస్తున్నాడు మా హర్ష, ఏం మేజిక్ చేశా డో అతను" అంది గిరిజ కూడా.

"హ్మ్మ్, ఇదేదో కొంచం చూడవలసిన విషయమే" అంది స్వాతి.

' అదేం అలా అంటున్నావు? "అంది అప్పుడే అక్కడకి వచ్చిన హరిత

" ఈమధ్యన ఎన్నిరకాలు వింటున్నాము? అన్నీ తెలిసీ మనం జాగ్రత్తగా ఉండకపోతే ఎలా? “అంది స్వాతి.

" అంటే? నీ ఉద్దేశ్యం??" భయంతో కళ్ళు పెద్దవి చేస్తూ అంది విద్య

" నా ఉద్దేశ్యం అని ఏమీ లేదు, మనం అనుకోనివి ఏదైనా కావచ్చు కదా, మనం జాగ్రత్తగా ఉంటే మంచిది, ఎన్ని వార్తలు వస్తున్నాయి ఈ మధ్యన? అంది స్వాతి..

స్వాతే చెప్పడం మొదలుపెట్టింది. తాను ఇక్కడకి బయలుదేరి వచ్చేముందే బెంగుళూరులోని ఒక స్కూల్ లో ఈ సంఘటన. మీరందరూ పేపర్లలో చదివే ఉంటారు అంటూ క్లుప్తంగా వివరించింది ఆ సంఘటన. అందరూ ఆలోచనలో పడ్డారు, అలాగే అసంకల్పితంగానే తలలూపారు

వారిమధ్య ఈ సంభాషణ జరిగిన రెండు మూడు రోజులకు నగరంలోని ఒక స్కూల్ లో ఒక చిన్న పాప మీద స్కూల్ లో సెక్యూరిటీ గార్డ్ అనుచితంగా ప్రవర్తిస్తున్నాడని, దానివల్ల ఆ అమ్మాయి భయంతో ట్రామాలోకి వెళ్ళిపోయిందన్న వార్త గుప్పుమంది. పేపర్లూ, టీ.వీ ఛానళ్ళూ హోరెత్తించాయి. స్కూల్ యాజమాన్యం ముందు బహిరంగంగా ఏ ప్రకటనా చేయకుండా తప్పించుకునే వీలుందేమోనని చూసిందనీ, ఆ సెక్యూరిటీ గార్డ్ ని వెంటనే ఉద్యోగంలోంచి తీసేయడం తప్ప మరేమీ చెయ్యలేదని అందరూ దుమ్మెత్తిపోసారు. తల్లితండ్రులు సంఘాలుగా ఏర్పడి స్కూల్ ముందు ధర్నాలు చేశారు. అప్పుడు చర్చలకు వచ్చిన స్కూల్ యాజమాన్యంతో తమకు కావలసిన జాగ్రత్తలన్నీ

రాసిన పత్రం మీద సంతకాలు చేయించుకుని అవి అమలులో ఉండేట్టు చూశారు. అన్ని వర్గాలలోనూ ఈ కేసు చాలా పెద్ద సంచలనం సృష్టించింది.

అది జరిగిన మరుసటి మళ్ళీ కలుసుకున్న ఆడవాళ్ళందరూ అదే విషయాన్ని గురించి చాలాసేపు చర్చించారు.

" మనకు తెలియకుండా ఎన్ని జరుగుతున్నాయో" అన్న భయం అందరిలోనూ మొదలయింది.

" పిల్లలని ఇరవై నాలుగు గంటలూ ఎలా కాపలా కాయగలం?" అనుకోసాగారు.

"ఎవరిని నమ్మాలో తెలియడం లేదు కదూ, ఎప్పుడూ వాళ్ళవెంటే ఉండలేం కదా"? అంది విద్య..

" అయినా మన జాగ్రత్తలో మనం ఉండాలి, నేనయితే భవ్యని ఇంట్లోంచి పంపడం తగ్గించేశాను" కూడా, అంది వాళ్ళ అమ్మ.

" ఎవరి దగ్గరా పిల్లల్ని ఎక్కువ సేపు వదలద్దు మనం. అది తెలిసినవారైనా సరే, ఎందుకో తెలుసుగా నమ్మకం ఉన్నచోటే మోసం ఉంటుంది. నేనైతే ఎవరినీ నమ్మలేను, అందుకే నేను నా పిల్లలిద్దరినీ నాతోనే తీసుకుని వచ్చి నాతోనే తీసుకుని వెళ్ళిపోదామనుకుంటున్నాను. పిల్లలందరినీ పిలిచి ఒకసారి చెబ్దామా? కొత్తవాళ్ళతో ఎలా ఉండాలో? అది జరిగిన మరుసటి  లాంటి విషయాలు అంది హరిత కూడా.

" మంచి ఆలోచన. అయినా మన కాంప్లెక్స్ లో భయం లేదులే, మనం చెప్పాల్సింది స్కూల్ బస్సులూ, స్కూల్, పబ్లిక్ ప్లేసుల్లో. వీటి గురించి" అంది విద్య.

" ఏమో ఎవరెలాంటివారో ఎవరు చూడొచ్చారు? నేనయితే ఎవరినీ నమ్మలేను" అంది మమత. ఆవిడ చూపు పిల్లలని ఆడిస్తున్న అనిల్ మీదే ఉంది. అనిల్ తన కెమేరాతో భవ్యకీ, రిషికకీ ఫోటో తీస్తున్నాడు. వాళ్ళిద్దరూ విరిసిన రోజాల్లా నవ్వుతున్నారు.

" భవ్యా, కం హియర్" అంటూ కోపంగా పిలిచింది మమత.  తల్లి కళ్ళల్లో కోపానికి భయపడిపోయి పరుగున వచ్చింది భవ్య.

“ఏం జరుగుతోందో?”  అర్థం కానట్టుగా చూశారు అనిల్, రిషికా. ప్రీతి కూడా రిషికని తీసుకుని వెనకే వెళ్ళింది.

ఇది జరిగిన రెండు రోజులకి పొద్దున్నే అనిల్ కనిపించలేదు. "ఎక్కడికెళ్ళాడు? ఇంత పొద్దున్నే?" అనుకున్నారు. మోటర్ వేసి టాంక్ నిండ నీరు నింపి ఉంది. క్రింద బేస్ మెంట్ ఎప్పటిలాగే తుడిచి ఉంది, కార్ల రాకపోకలకి వీలుగా గేటు తెరిచి ఉంది. అనిల్ మాత్రం లేదు. సాయంత్రం వరకూ చూసి అప్పుడు కమిటీ మెంబర్లందరూ ప్రెసిడెంట్ ఆనంద్ ఇంటికి వచ్చారు. అదే మొదటి మీటింగ్.

\-\-\-\-\-\-\-\-\-\-\-\-\-\-

ఏమయిందో చెప్పు అనిల్? నిన్ను అంత బాధపెట్టిన విషయం ఏమిటి? ఎవరైనా ఎమైనా అన్నారా? అన్నాడు రాజీవ్, సొసైటీ సెక్రెట్రీ.

" అవన్నీ ఎందుకు సార్? నేనిక్కడ ఉండలేను" అన్నాడు అనిల్ పొడిగా.

"అదే? ఎందుకు? అన్నారు ఆనంద్ ఆత్రంగా.

" మీకు చెప్పాను కదా సార్ నేను బెంగుళూరు లో పనిచేసే చోట అపార్ట్మెంట్ వారిచ్చిన దాంట్లో సగం ఇచ్చేవారు మమ్మల్ని అక్కడ పనిలో పెట్టిన ఏజెన్సీ వారు.  కొన్ని సార్లు పద్దెనిమిది గంటలపాటు వరసన డ్యూటీ చేయాల్సి వచ్చేది. నేను ఒంటరివాడిని నాకు పరవాలేదు, నా స్నేహితుడొకడు తనకి పెళ్ళయింది కనక కొద్దిగా జీతం పెంచమంటే చాలా దారుణంగా మాట్లాడి అవమానించారు. అందుకే అక్కడ పని మానేసి ఇక్కడికొచ్చాను వాడితోపాటే.

ఇక్కడ అంతా బాగుందనుకున్న సమయంలో మొన్న మన మేడం లందరూ మాట్లాడుకున్న మాటలు అనుకోకుండానే వినవలసి వచ్చింది. వారికి నా మీద, లేదా మాలాంటివారి మీదున్న అభిప్రాయం అర్థం అయ్యాకా ఇక్కడ పనిచేయడం ఎంతమాత్రం భావ్యం కాదనిపించింది.

నాకు సినిమా కథలు చెప్పడం రాదు సార్. ఉన్నదేదో చెప్తాను. ఇక్కడివారందరినీ నాకు అన్నం పెడుతున్నారు కనక ఎంతో గౌరవంగా చూశాను. ముఖ్యంగా పసివాళ్ళంటే నాకెంతో ఇష్టం, ఎప్పుడూ పిల్లలు కూడా నాతో ఎంతో ప్రేమగా ఉంటారు. ఎక్కడో జరిగిన సంఘటన ఒకటి పట్టుకుని ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ నన్ను చాలా అన్నారు, అనుకున్నారు మేడం లు. పిల్లలకి తీసిన ఫోటోలు డిలీట్ చెయ్యమంది మమతా మేడం. అలా ఎందుకు చేశావ్? అని హరితా మేడం అడిగితే ఆవిడన్న మాట నాకు ఆత్మహత్య చేసుకోవాలనిపించేలా చేసింది సార్.

" "ఎవరెలాంటివారో తెలీడంలేదు, ఫోటోలతో ఏం చేస్తారో కూడా చెప్పలేం. పీడో ఫిలియా లాంటి విపరీత లక్షణాలున్న వారెందరో ఉన్నారుట మన మధ్యనే, అలాంటివారు పసిపిల్లలని కూడా" ఆ పైన చెప్పలేనట్టుగా ఆగిపోయాడు.

" పది రూపాయలు తక్కువిచ్చినా, అసలివ్వక పోయినా పరవాలేదు సార్. కానీ నాకు ఊహ తెలిసినప్పటినించీ నేను ప్రాణంగా భావించే పసిపాపలగురించి నేను అనుచితంగా ప్రవర్తించగలనని ఆలోచించగలిగే మనుషులున్న చోట నేనుండడం కరక్ట్ కాదనిపించింది సార్. ఇందులో ఎవరి తప్పూ లేదు. జరుగుతున్న సంఘటనలూ, పెరుగుతున్న విపరీత ధోరణులూ, వెలుగు చూస్తున్న హేయమైన సంఘటనలూ , జాగ్రత్తగా ఉండమని చెప్తున్నాయి కాదనను. కానీ అందరినీ చూసిన రంగుటద్దాలలోంచి నన్ను కూడా చూస్తే నేనెందుకో భరించలేక పోయాను అంతే! నేనేమీ గొప్పవాడినని కాదు, కానీ నా మనసెందుకో విపరీతంగా గాయపడింది సార్.

వీలున్నంతవరకూ పిల్లలకి జాగ్రత్తలే చెప్పాను, ఎప్పుడూ, ఎవరికీ చిన్న అపకారం చెయ్యలేదు. చేసుంటే అందరికంటే ముందు గుర్తించేవి ఆ పసిమనసులే సార్. వాటిల్లో నాకింత చోటు ఉండేదే కాదు. " అంటూ వెళ్ళడానికి వెనుదిరిగాడు అనిల్.

COMMENTS